నేటి నుంచి బడిబాట

ప్రభుత్వ పాఠశాలల్లో నుంచి ప్రవేశాలకు శ్రీకారం

సికింద్రాబాద్: వేసవి సెలవుల విరామం అనంతరం పాఠశాలల్లో తరగతులు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. బడిబాట పేరుతో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం ద్వారా విద్యార్థులకు చేకూరే ప్రయోజనాలు వివరించనున్నారు. సికింద్రాబాద్ నగరంలోని నాలుగు మండలాల పరిధిలో 112 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో గత విద్యా సంవత్సరం వరకు విద్యార్థుల సంఖ్య 19400 మంది ఉన్నారు. ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను మరింతగా పెంచేందుకు 15 రోజుల పాటు బడిబాట కార్యక్రమాలు కొనసాగించనున్నారు.

నేటి నుంచి ర్యాలీలు... కరపత్రాల ప్రచారం

◆ **ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి బస్తీల్లో బడిబాట కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈనెల 6 నుంచి పది**హేను రోజుల పాటు బడిబాట కార్యక్రమాలు కొనసాగించనున్నారు. బస్తీలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు నివసించే ప్రాంతాలు ఎంపిక చేసుకుని ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

◆ కరపత్రాలు పంపిణీ చేయడం, వాల్‌పోస్టర్లు వేయించడం, విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించే ఏర్పాట్లు ప్రారంభించనున్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఆశాజనకమైన ఫలితాలు సాధించారు. ప్రత్యేకంగా బడిబాట కార్యక్రమాల ఫలితంగా గత ఏడాది 500 మంది పిల్లల అడ్మిషన్లు పెరిగినట్టు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తల్లితండ్రులకు భరోసా ఇస్తూ..

◆ ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు ముందుగా వారి తల్లితండ్రులను ఒప్పించే **విధంగా ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్‌లకు మార్గదర్శక సూత్రాలను వివరించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేవిధంగా భరోసాలు ఇవ్వడం, ప్రభుత్వం నుంచి అందించే పుస్తకాలు, వసతులు** తెలియజెప్పడం తదితర అంశాలను వివరించి నమ్మకం పెంచే విధంగా వ్యవహరించే పద్ధతులు తెలియజెప్పారు.

◆ ఇందులో భాగంగా ఈనెల 6న అన్ని పాఠశాలల పరిధిలో గ్రామసభలు నిర్వహిస్తారు. 7న బడిలో చేర్పించేందుకు వయసు వచ్చిన పిల్లలను గుర్తించడం, 8 నుంచి 10వ తేదీ వరకు డ్రాప్‌అవుట్ పిల్లల గుర్తింపు, కరపత్రాల ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11 నుంచి 18 వరకు బడిబాట సమీక్షలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ, సామూహిక అక్షరాభ్యాసాలు, తరగతి గదులు, డిజిటలైజేషన్ వంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తారు. 19న విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించి బడిబాట కార్యక్రమాలు ముగిస్తారు.



గురువారం చిలకలగూడలో బడీడు పిల్లల సర్వే నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

లష్కర్ పాఠశాలలు - విద్యార్థులు

'సికింద్రాబాద్ మండలం	
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు:	49
విద్యార్థులు:	5,400
'మారేడుపల్లి మండలం	
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు:	39
విద్యార్థులు:	9,100
'ముషీరాబాద్ మండలం	
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు:	34
విద్యార్థులు:	4,900

పాఠశాలల్లో వసతులు పెంచాలి



ప్రభుత్వ పాఠశాల్లో వసతులు ఏర్పాటు చేయాలి. కార్పోరేటర్ పాఠశాలలకు దీటుగా సదుపాయాలు ఏర్పాటు చేస్తే విద్యార్థుల సంఖ్యను సులభంగా పెంచవచ్చు. సాధారణ అభివృద్ధి పనులు వేగవంగంగా చేపడుతున్న మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– మల్లికార్జున్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి



బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం అన్నివిధాల చర్యలు తీసుకున్నాం. ఉపాధ్యాయులు,రిసోర్స్‌పర్సన్లు వ్యవహరించాల్సిన తీరు పట్ల అవగాహన కల్పించాం. ఈ ఏడాది పాఠశాలల్లో అభివృద్ధి పనులు, కంప్యూటర్ తరగతుల ఆధునీకరణ నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాలను గతేడాది కన్నా ఎక్కువ సంఖ్యలు రాబడుతాం.

– శ్రవణ్‌కుమార్, మండలవిద్యాశాఖ అధికారి

7న బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సభ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం**లో ఈనెల** 7వ తేదీన మధ్యాహ్నం 2గంటల**కు జరిగే** బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ **సద**స్సును జయప్రదం చేయాలని ఆ **పార్టీ రాష్ట్ర** కన్వీనర్ జన్ను సాంబయ్య పిలుపు**నిచ్చారు.** బహుజన మహనీయుల ఆశయ సా**ధన కోసం** ఈ పార్టీని స్థాపిస్తున్నట్లు చెప్పారు. అనేక సంవత్సరాలుగా పాలకుల చేతుల్లో రాజకీయ బందీలుగా ఉన్న బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

10న బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన మంగళవారం హైదరాబాద్ నగరంలో బీసీల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు, దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన, భవిష్యత్ బీసీ ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం కాచిగూడలో బీసీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ఐకాన్ అవార్డుల ప్రదానం



రూబీ స్టీఫెన్సన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అంబర్‌పేట: తెలంగాణ ఐకాన్ అవార్డును తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు రూబీ స్టెవెన్‌సన్, ఉద్యమకారులు పిండిగ వెంకన్నలు అందుకున్నారు. సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో వారు ఈ అవార్డును అందుకున్నారు.

రోడ్డు పనుల పరిశీలన



చెప్పల్‌బజార్‌లో పనులను పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లోని దశరథ లేన్, లింగపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందికి సూచించారు. నాణ్యతతో రోడ్డు పనులు జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, బీజేపీ నేతలు బల్వీర్, నరేష్, బి.భీమ్‌రాజ్, వాసు, సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (30) ఉందానగర్ –జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8న సివిల్స్ ర్యాంకర్లకు ఆత్మీయ సన్మానం

చిక్కడపల్లి: కృష్ణప్రదీప్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్ ర్యాంకర్లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఈనెల 8న నిర్వహిస్తున్న చైర్మన్ కృష్ణప్రదీప్ తెలిపారు. అకాడమీలో గురువారం కార్యక్రమ పోస్టర్‌ను డైరెక్టర్ భవానీశంకర్, ఫ్యాకల్టీ చింత గణేష్ ఆవిష్కరించి మాట్లాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, అదనపు డీజీ మహేష్‌భగవత్ హాజరవుతారని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి



కేంద్ర గ్రంథాలయంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో చండీ, రుద్రహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్‌లో రేణుకాఎల్లమ్మ, పోచమ్మ దేవాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎ.వినయ్‌కుమార్, ఉమేష్, ఆనంద్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ గంటా నర్సింగ్‌రావు, సభ్యులు నర్సింగ్‌ముదిరాజ్, లక్ష్మణ్, జగన్, జీవై గిరి, సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆవరణలోని ఆలయంలో...

చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలోని రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా గురువారం ఉదయం వేదపారాయణం నిర్వహించారు. అనంతరం చండీహోమం, సాయంత్రం ఆవాహిత హోమం, రుద్రహోమం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కె.ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పద్మజ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూజలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, వినయ్‌కుమార్

సత్యహరిశ్చంద్ర నాటకం



కళాకారులతో లంకా లక్ష్మీనారాయణ, త్రినాథరావు, కృష్ణయ్య

చిక్కడపల్లి: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్య నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. త్యాగరాయ గానసభలో గురువారం నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. సత్యహరిశ్చంద్రుడిగా లక్ష్మీకాంతశర్మ, చంద్రమతిగా సాయి లక్ష్మి, అర్జునుడిగా భాగిశాస్త్రి పాత్రోచితంగా నటించారు. అనంతరం జరిగిన సమావేశంలో కళాకారులను లంకా లక్ష్మీనారాయణ, చింతలపూడి త్రినాథరావులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు లోకం కృష్ణయ్య, మోహనకృష్ణ, చంద్రబాబునాయుడు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించింది'

కాచిగూడ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆరోపించారు. గురువారం నింబోలిఅడ్డలోని మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో ఇప్పటి వరకు విద్యాశాఖ పట్టించుకునే నాథుడే లేడన్నారు. 20లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించకపోవడం దారుణమని అన్నారు. దీంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న రేవంత్‌రెడ్డి కనీసం విద్యాశాఖపై దృష్టి సారించకపోవడం దారుణమని అన్నారు. విద్యార్థుల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రంలో బీసీ మహాసభ నేతలు డాక్టర్ ప్రశాంత్ నీమ్‌కర్, భూషణ్ భాస్కర్, పి.కృష్ణ, ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే గుర్తింపు

చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు బీజేపీలో గుర్తింపు లభిస్తుందని గాంధీనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆనంద్ అన్నారు. డివిజన్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా గురువారం సాయంత్రం ఆయన గాంధీనగర్‌లో మాట్లాడారు. తనకు నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత వస్త్రాలు, బ్యాగులు వాడాలి

చిక్కడపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు, బ్యాగులను వాడాలని ప్రకృతి ప్రేమికుడు రాజయోగి డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. ప్రముఖ సినీనటి రేణుదేశాయ్‌ను గురువారం సాయంత్రం కలసి చేనేత బ్యాగును అందజేశారు. 'పర్యావరణ నేస్తం.. చేనేత వస్త్రం'అని ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని ఆమె పిలుపునిచ్చారు.

బతుకమ్మకుంట పునరుద్ధరణ ఏకపక్షం

- డీడీకాలనీలో పార్క్ స్థలాన్ని వీహెచ్ కబ్జా చేశారు
- హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే దానిని పునరుద్ధరించాలి
- బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: కుంటల పేరుపై ఉన్న ప్రాంతాల్లో 'హైడ్రా'కుంటలు తవ్వి చిత్తశుద్ధిని చాటుకోవాలని బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి కోరారు. ఉదాహరణకు మాసాబ్‌ట్యాంక్, ముషీరాబాద్‌లో నాగమయ్యకుంట వంటి ప్రాంతాల్లో కుంటలు ప్రస్తుతం లేవని అక్కడ కుంటలు తవ్వాలని ఆయన తెలిపారు. అంబర్‌పేటలో ప్రైవేటు స్థలం పరిసర ప్రాంతానికి బతుకమ్మకుంట అని పేరు ఉంటే అక్కడ కుంట ఉందని.. కక్షపూరితంగా కుంట తవ్వడం దారుణమని అన్నారు. గురువారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ... బతుకమ్మకుంటపై కోర్టులు ఇచ్చిన తీర్పులకు వక్రభాష్యం చెబుతూ హైడ్రా అన్యాయం చేస్తోందన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతారావు బతుకమ్మకుంటపై హైడ్రాను తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు.



◆ డీడీ కాలనీ భాగ్యనగర్ సొసైటీలో పార్కు స్థలాన్ని వీహెచ్ ఆక్రమించి భవనాలు నిర్మించారని ఆరోపించారు. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే భాగ్యనగర్ సొసైటీ లేఔట్‌ను తెప్పించుకుని పార్కును పునరుద్ధరించాలని హైడ్రాకు సవాలు విసిరారు. వీహెచ్ భాగ్యనగర్ సొసైటీలో పార్కు స్థలం ఆక్రమించడంతో సొసైటీ సభ్యులు ప్రభుత్వానికి జరిమానా చెల్లించాల్సిన పరిస్థితులు తలెత్తాయని తెలిపారు. అలాగే బాగ్‌అంబర్‌పేట వెల్ఫేర్ సొసైటీ, తులసీ సొసైటీ స్థలంలో 40 శాతం ఖాళీ స్థలం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నగరంలో ఎన్నో ప్రభుత్వ స్థలాల్లో ఉన్న వాటిని పునరుద్ధరించకుండా ఒక్క బతుకమ్మకుంటపై అది ప్రైవేటు వ్యక్తులు అభ్యంతరం చెప్పినప్పటికీ యుద్ధ ప్రతిపాదికన పనులు చేయడం కక్షపూరితంగా వ్యవహరించడమేనని అన్నారు.



గిరిజన హక్కుల సంఘం ఏర్పాటు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గిరిజన హక్కుల సంఘం (జీహెచ్ఎస్)ను గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేశారు. అనంతరం ఈ సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా బానోతు రామరావు, కో కన్వీనర్లుగా తిరుపతి, బాలు నాయక్, భూక్య శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా సంతోష్, శంకర్ ,కొర్ర రాజు నాయక్, లక్‌పతినాయక్, రాజారాం, రాజేందర్, నరేష్ నాయకులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ పాశం యాదగిరి మాట్లాడుతూ... భూమిలేని గిరిజనులకు మూడెకరాల భూమిని ప్రభుత్వమే కేటాయించాలన్నారు. 5, 6 షెడ్యూల్స్‌ను సంపూర్ణంగా అమలు చేయాలని పీసా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జీవోనం.3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం కార్యదర్శి నారాయణరావు, ముఖ్య సలహాదారుడు గుగులోత్ కిషన్‌నాయక్, దేశభక్తి ప్రజాతంత్ర అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముషీరాబాద్: నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా డీఈవో వెంకటయ్యనాయక్, రంగారెడ్డి జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వడ్డెన్న కార్యాలయంలో విద్యార్థి నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అంజి మాట్లాడుతూ... హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కళాశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు రుక్మత్ పాషా, ధనుష్, రంజిత్, నితిన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

కవాడిగూడ: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణ మఠం ఎదురుగా ఉన్న లవ్ బర్డ్ కేఫ్ పక్కనే ఉన్న రిలయన్స్ మ్యాన్షన్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన శివరాం(24) అనే వ్యక్తి కారును పార్కింగ్ చేశాడు. అనంతరం సెల్లార్‌లో పేరుకుపోయిన నీటిని బయటకు పంపించేందుకు అక్కడే ఉన్న మోటర్‌ను ఆన్ చేయడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కారు యజమాని, అపార్ట్‌మెంట్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించదని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. శివరాం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరానగర్ సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దిశా కమిటీ సభ్యులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో నెలకొన్న డ్రైనేజీ, కలుషిత నీటి నివారణను అరికట్టడంతో పాటు ఆధునిక రోడ్లు వేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ఇందిరానగర్‌కు చెందిన శాంతి భారత్ సేవా సమాజ్ కమిటీ, దిశా కమిటీ సభ్యులు నందగిరి నర్సింహ, కేఎల్.సత్యనారాయణ, సంగపాక నర్సింగ్‌రావు, భాస్కర్ ఎమ్మెల్యేను కలిసి ఇందిరానగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. గత 38 సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్‌లు అధ్వానంగా మారడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఫిర్యాదు చేశారు. నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి ఇళ్ల ముందు, స్థానిక అమ్మవారి దేవాలయం ముందు మురుగు పారుతోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, కాలుషిత నీటి నివారణకు కొత్త పైపులైన్‌లు వేసేందుకు జలమండలి ఎండీతో మాట్లాడి నిధులు విడుదల చేయిస్తామని తెలిపారు. రోడ్లను ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరానగర్‌లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు రాజు, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ మనుగడకు కారణమైన పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ నాయకులు అజీజ్ బాషా అన్నారు. గురువారం సుందరయ్య పార్కు వద్ద ఇస్కాఫ్, ఇన్‌సాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ బాషా మాట్లాడుతూ... జీవవైవిధ్యానికి ఉత్తమ పర్యావరణమే శ్రీరామరక్ష అన్నారు. గ్లోబల్ వార్మింగ్ వద్దని పర్యావరణ పరిరక్షణే అందరికి ముద్దు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 6 మిలియన్‌కుపైగా చెట్లను నరికివేస్తున్నారని అందులో సౌత్ ఇండియా తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందన్నారు. ఫారిస్ ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాఫ్ అధ్యక్షుడు ఆర్.గోపాల్, ఇన్‌సాఫ్ అధ్యక్షుడు మునీర్ పటేల్, ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్‌రావు, జె.సురేందర్, విజయలక్ష్మి, శ్రీనివాసరావు, బాలకృష్ణ, షబీర్, అన్వర్, ఎండీ కాశీం తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణాన్ని పరిరక్షించాలని ర్యాలీ నిర్వహిస్తున్న ఇస్కాఫ్, ఇన్‌సాఫ్ ప్రతినిధులు

అంబేద్కర్ కళాశాల నుంచి భారీ ర్యాలీ...

పర్యావరణ పరిరక్షణకు తమ వంతున కృషి చేస్తున్నామని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొ. లింబాద్రి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ కళాశాలలో మొక్కలను నాటారు. అంతకముందు పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ అంబేద్కర్ కళాశాల నుంచి సుందరయ్య పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికి ఒక చెట్టు నాటడం ద్వారా పర్యావరణాన్ని సంరక్షించుకోవాలనే ఆలోచనను ముందుకు తీసుకుపోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపల్ మట్టా శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ ఆఫీసర్ కుమారస్వామి, బండ్ల శ్రీధర్, నూనె స్వప్న, శ్రావణ్, అడ్మిన్ ఆఫీసర్ ఎన్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

కవాడిగూడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గగన్‌మహల్‌లోని శివశక్తి ప్యాలెస్ వీధిలో డాక్టర్ కె.లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు టి.రవీందర్, భరత్‌గౌడ్, రమేష్‌రాం, వెంకటేష్, పరిమళ్ కుమార్, పద్మారెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్ద మొక్కను నాటాలి

ముషీరాబాద్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఇంటి వద్ద మొక్కను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, కంచి ముదిరాజ్, సత్యనారాయణ, మెట్టు వాసు, లక్ష్మణ్ నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ కళాశాలలో మొక్కను నాటుతున్న ప్రొ.లింబాద్రి



గగన్‌మహల్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ జి.రచనశ్రీ



ముషీరాబాద్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్